క్లుప్తంగా

వేడుకగా పెళ్లిరాట


మునగపాక లింగరాయి గుడిలో పెళ్లిరాట

మునగపాక : మండల కేంద్రమైన మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో ఆదివారం పెళ్లిరాట మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. కాశీ విశాలాక్షి సహిత విశ్వేశ్వరస్వామి వివాహ కార్యక్రమంలో భాగంగా వేద పండితులు సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాట మహోత్సవంలో ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, పెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, చిన్న, తేలు నూకరాజు, కిరణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మన్మథరావు

అనకాపల్లిటౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి, గోవిందమాంబ అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కల్యాణంలో వ్యాపారవేత్తలు కె.సురేష్, దుర్గ అమ్మాజీ, పి.కృష్ణమూర్తి, రాణీ మణి దంపతులు పాల్గొన్ని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆదివారం పట్టణ కామాక్షి కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎండపల్లి మోహన్‌బ్రహ్మజీ, అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక దేవాలయం ప్రథమ వార్షికోత్సవం


అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీ గౌరీసంపత్ వినాయక దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ పాల్గొని, మహాగణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొణతాల శేషు, భీశెట్టి రవి, ఆడారి రవికుమార్, గాడి మాధురినాయుడు, గిరి, ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఎంపికల్లో నునపర్తి క్రీడాకారుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన నునపర్తి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

అచ్యుతాపురం : బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలో అచ్యుతాపురం మండలం నునపర్తి శ్రీరామా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. వచ్చే నెల నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికకు టి.అర్జాపురంలో చేపట్టిన క్యాంప్‌లో నునపర్తి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు బి. ప్రసాద్, కె. హేమకుమార్, ఎం.లయ, రాధా స్రవంతి, కళ్యాణి, హైమావతి, రాజ్యలక్ష్మి, హిమబిందు, ప్రశాంతి, పి. సుస్మశ్రీలను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెదపూడి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు, కోచ్ డి. శ్రీనివాస్, అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు ఆదివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

అభివృద్ధి ప్రచార సారథులు మీరే

- చంద్రబాబు అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ రద్దు చేస్తారు
- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీరే కీలకం
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు


సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

నక్కపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. ఆదివారం నక్కపల్లి మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలపై ఎంతో నమ్మకంతో సమర్థవంతులైన వారిని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులుగా ఎంపిక చేశారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే గురుతర బాధ్యత అప్పగించారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలన్నారు.

రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా పేదలకు సుమారు రూ.2 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చారని తెలిపారు. అమ్మఒడి, పింఛన్ల పెంపు, రైతు భరోసా, డ్వాక్రా రుణమాఫీ, నేతన్న నేస్తం, వైఎస్సార్ భరోసా, ఆసరా, చేదోడు, ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్, జగనన్న విద్యాదీవెన , జగనన్న విద్యావసతి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద ఇలా ప్రతి ఒక్కరికీ భారీ స్థాయిలో సంక్షేమ ప్రయోజనాలు దక్కాయన్నారు. నియోజకవర్గంలో జగనన్న లే అవుట్లతో సుమారు 10 వేలమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, వారందరికి పక్కా ఇళ్లు మంజూరు చేసిన విషయాన్ని తెలిపారు. రూ.200 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు, రూ.64 కోట్లతో రోడ్ల నిర్మాణం, నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, నక్కపల్లి, కోటవురట్లలో 30 పడకల ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంపు, రూ.6 కోట్లతో నూతన భవనాల నిర్మాణం, పాయకరావుపేట పీహెచ్‌సీకి రూ.1.30 కోట్లతో కొత్తగా భవన నిర్మాణం, స్థానికంగానే అన్ని సేవల్ని పొందేలా రూ.150 కోట్లతో సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ఎన్నికలకు ఇంకా 14 మాసాలే గడువుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించగలిగితే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. జగనన్న సీఎం అయితేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయని, చంద్రబాబు అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేయడంతోపాటు, రాష్ట్రం మరో 40 ఏళ్లు వెనక్కి వెళ్లిపోతుందన్నారు. మార్చి 18 నుంచి మా భరోసా నువ్వే జగనన్న అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు యలమంచిలి తాతబాబు, సూరాకాసుల రామలక్ష్మిగోవిందు, బొల్లం అప్పలకొండబాబ్జి, సర్పంచ్‌లు గొర్లనర్సింహమూర్తి, ఎరిపల్లి మునలయ్య, రెడ్డి వరహాలు, కర్రి వరహాలు, నాగఅప్పలరాజు, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, బచ్చలరాజు, పక్కుర్తి రమణ, నాయకులు శీరం నర్సింహమూర్తి, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, జి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి : మండలంలోని చందనాడలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. చందనాడ, నల్లమట్టిపాలెం, తమ్మయ్యపేట తదితర గ్రామాల నుంచి వందలాది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కోలాటం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

గుర్రం పరుగు పోటీ విజేత రామన్నపాలెం


తీడలో గుర్రం పరుగు పోటీలు

కశింకోట: మండలంలోని తీడలో ఆదివారం సాయంత్రం జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి గుర్రం పరుగు పోటీల్లో అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన గుర్రం ప్రథమ బహుమతి గెలుచుకుంది. కల్యాణం పోతురాజుబాబు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గుర్రం ద్వితీయ, భీమిలికి చెందిన గుర్రం తృతీయ, భీమిలికి చెందిన మరో గుర్రానికి నాలుగో స్థానం లభించాయి. ఈ మేరకు వాటి నిర్వాహకులకు నగదు బహుమతులను ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, దుంగల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దుంగల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులకు శిక్షణ నేడు

కోటవురట్ల : వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్‌ఎస్ సీతారామరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న లే అవుట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొంటారని తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, మండల కన్వీనర్, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు బెనర్జీరావు సంతాప సభ

అనకాపల్లిటౌన్: విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఇస్కాప్ పట్టణ అధ్యక్షుడు స్వర్గీయ కర్రి బెనర్జీరావు సంతాప సభ సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక నెహ్రూచౌక్ వై.విజయకుమార్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఇస్కాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెనర్జీరావు అభిమానులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఇస్కాప్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

23న రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిటౌన్ : రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రాజెక్టు చైర్మన్ కడిమిశెట్టి సతీష్, క్లబ్ అధ్యక్షుడు సానా త్రినాథ్, కార్యదర్శి పెంటకోట రాజేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, భీమునిగుమ్మం హైస్కూళ్లలో ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్కేళ్లు అందజేస్తామన్నారు. మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో, న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పట్టణ, మండల పరిధిలో గత ఏడాది పదోతరగతి, ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించనున్నట్లు వెల్లడించారు.

పదిలో మెరుగైన ఫలితాలకు ‘కృషి’


పరీక్షా కేంద్రంలో ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్


కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం : పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి-50 రోజుల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్నాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13 నుంచి 50 రోజులు పాటు ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు, వారాంతపుపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, సైన్స్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం సెలవురోజైనప్పటికీ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కేహెచ్ వాడ ఉన్నత పాఠశాలలను ఉపవిద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. కృషి కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన ఇంగ్లిష్, సైన్స్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

మిరపలో నల్ల తామర పురుగు

రాంబిల్లి : మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించినట్టు హరిపురం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పలు గ్రామాల్లో మిరప పంటను పరిశీలిస్తే నల్ల తామర పురుగు ప్రభావం కనిపించిందన్నారు. రైతులు సకాలంలో ఈ పురుగు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పురుగు పూత దశలో రసం పీల్చివేయడం ద్వారా పిందె కట్టకుండా చేస్తుందన్నారు. మిరపతో పాటు పెసర, మినుము పంటల్లో కూడా ఈ నల్ల తామర పురుగు కనిపించినట్టు పేర్కొన్నారు. ఎకరాకు 8 కిలోల చొప్పున ఫిప్రోనిల్ గుళికలను తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలన్నారు. ఎకరాకు 10 పసుపు రంగు, 10 నీలం రంగు జిగురు అట్టలను పొలంలో కట్టాలని సూచించారు. అవసరం బట్టి 2 మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

మునగపాక : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగం అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. మహిళలు వందల సంఖ్యలో ప్రమిదలను నూనె, ఒత్తి వేసి వెలిగించి, శివపంచాక్షరీ మంత్ర పఠనంతో శివలింగాకృతిని నిలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపాలంకరణ జరిగింది.


దీపాలతో భక్తులు ఏర్పాటు చేసిన శివలింగం

విజయం చిన్నదైనా స్ఫూర్తి అనంతం


విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: విద్యార్థులను వారి అభిరుచి మేరకు చిన్నతనం నుంచే ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల నుంచి వివిధ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థుల అభినందన సభ ఆదివారం స్థానిక స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ స్థాయి నుంచే విజయకాంక్ష ఉంటుందని, కేవలం చదువులోనే కాకుండా వారిని ఇతర రంగాల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. విజయం చిన్నదైనా, అదిచ్చే స్ఫూర్తి అనంతమని, అందుకే జ్ఞాపికలు కుండా ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతులుగా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, భానుమూర్తి, డా.కె.వీర్రాజు, ప్రధానోపాధ్యాయులు, బహుమతులు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అప్పలనరసింహంకు ఘన నివాళి


మాజీ ఎంపీ అప్పలనరసింహం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : అనకాపల్లి మాజీ ఎంపీ స్వర్గీయ పెతకంశెట్టి అప్పలనరసింహం జయంతి కార్యక్రమం మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం నిర్వహించారు. అప్పలనరసింహం విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అప్పలనరసింహం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సాధికారిక సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య, మండల టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, నాగులాపల్లి మాజీ సర్పంచ్ భాస్కరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణతో పులకించిన భక్తజనం

- ఘనంగా ముగిసిన శివరాత్రి వేడుకలు
- రెండో రోజూ కిక్కిరిసిన శివాలయాలు


రేవుపోలవరం తీరంలో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు


పాములవాక పట్టాలమ్మతల్లి ఆలయంలో భక్తులు


ఆకాశధార వద్ద పుణ్యస్నానం ఆచరిస్తున్న భక్తులు

పాయకరావుపేట : మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి ఆయా గ్రామాల్లో శివరాత్రి జాతర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శైవక్షేత్రాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాల్మన్‌పేట గ్రామంలో శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహించి, కోలాటం, పిల్లలతో డాన్స్ తదితర కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

ఎస్.రాయవరం : మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులు ఆదివారం ఉదయం సముద్ర స్నానమాచరించి, సమీప దేవాలయాల్లో పూజలు చేసి, ఇళ్లకు చేరుకున్నారు. మండలంలోని పెదఉప్పలం బ్రహ్మలింగేశ్వరస్వామి, ఎస్.రాయవరం శ్రీ బుర్రేశ్వర స్వామి, సర్వసిద్ధి శ్రీ సిద్ధి లింగేశ్వరస్వామి, పెదగుమ్ములూరు, పెనుగొల్లు, వేమగిరి కాశీవిశ్వేశ్వరస్వామికి భక్తులు మహారుద్రాభిషేకాలు చేసి తెల్లవారుజాము వరకు జాగరణ చేశారు. అనంతరం భక్తులు సముద్ర స్నానానికి వెళ్లి పూజలు నిర్వహించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : మహా శివరాత్రి సందర్భంగా భక్తులు శనివారం రాత్రంతా జాగరణ చేశారు. తెల్లవారు జాము వరకూ ఓం నమఃశివాయ అంటూ శివపంచాక్షరీని స్మరిస్తూ, ఆలయాల్లోనూ, వివిధ ప్రాంతాల్లోనూ జాగారం ఉన్నారు. ఆదివారం ఉదయాన్నే సముద్ర స్నానాలు ఆచరించారు. తిమ్మరాజుపేట, జగ్గన్నపేట, హరిపాలెం, కొండకర్ల, ఎం.జగన్నాథపురం, అచ్యుతాపురం, వెదురువాడ, పూడిమడక, మడుతూరు, దోసూరు, నునపర్తి, కొండకర్ల తదితర గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి.

కోటవురట్ల : మహా శివరాత్రి జాగరణ పూర్తిచేసిన భక్తులు ఆదివారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాములవాక శివారు పట్టాలమ్మతల్లి ఆలయం, కోటవురట్లలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి, యండపల్లి శివారు శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి, కైలాసపట్నంలోని శ్రీ రాజగోపాల స్వామి, పందూరులోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి, చిన లింగాపురంలోని శ్రీ దుర్గా మల్లేశ్వర అయ్యప్ప ఆలయాలలో భక్తుల తాకిడి నెలకొంది. వరాహనదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు.

రాంబిల్లి : మహా శివరాత్రి సందర్భంగా భక్తులు పాటించిన ఉపవాస దీక్షలను ఆదివారం విరమించారు. ఉపవాసంతో పాటు శనివారం రాత్రంతా జాగరణ చేసిన భక్తులు పంచదార్ల పుణ్యక్షేత్రంకు వెళ్లి ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకుని దీక్షను విరమించారు. శ్రీ ఉమా ధర్మలింగేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అలరించిన సంప్రదాయ నృత్యాలు

దిమిలిలో మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దిమిలికి చెందిన శ్రీ లలితా మాత డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు అద్భుత నాట్య ప్రదర్శన చేశారు. కె.హర్షవర్ధిని పలు భక్తిరస చిత్రాల్లో పాటలకు నృత్యం చేసి ఆకట్టుకుంది. డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు కె.గాయత్రి, కోలాటాల గురువు ఎస్.పద్మలతో పాటు నృత్యాలు చేసిన చిన్నారులను సర్పంచ్ బంగారు చిలుకు, ఉపసర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ తదితరులు మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో డబ్బీరు కామేశ్వరరావు, కన్నం బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వర నీరాజనం

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన స్వర నీరాజనం అందరినీ ఆకట్టుకుంది. పార్వతీ సాంబమూర్తి ఆలయ ప్రాంగణంలో జేటీఆర్ కల్చరల్ ట్రస్ట్ నేతృత్వంలోఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సింగర్ రాజు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీనిలో భాగంగా సింగర్‌రాజు, అతని మిత్ర బృందాన్ని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.


సాల్మన్‌పేట జాతరలో కోలాటం ఆడుతున్న బాలికలు


భక్తి గీతాలు ఆలపిస్తున్న సింగర్ రాజు


సంప్రదాయ నృత్యం చేస్తున్న చిన్నారులు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేత కె.జె.పురం


ప్రథమ బహుమతి అందుకుంటున్న కేజే పురం జట్టు సభ్యులు

మాడుగుల రూరల్: మహా శివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని కె.జె.పురం శివాలయం వద్ద జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కె.జె.పురం జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 25 జట్లు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రథమ బహుమతి కె.జె.పురం జట్టుకు రూ. 10 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులు బుచ్చెయ్యపేట జట్టుకు రూ. 8 వేలు, విశాఖపట్నం జట్టుకు దక్కాయి.